# అచలపతీ- మగసిరి

ఆ రోజు ఉదయం చాలా ప్రశాంతంగా ఉంది. మనస్సు విప్పి అచలపతితో మాట్లాడ బుద్ధేసింది.

"డబ్బున్నవాళ్లకీ కష్టాలుంటాయి కదోయ్ అచలపతీ?"

"యస్ సర్. పీత కష్టాలు పీతవి అన్నాడు శ్రీశ్రీ" అన్నాడు అచలపతి వంత పాడుతూ.

"అంటాడంటాడు. పీతలకూ, కుక్కపిల్లలకూ, సబ్బుబిళ్లలకూ కష్టాలుంటాయని గుర్తించండి, వాటి గురించి కథలు రాయండి అంటాడు. రావిశాస్త్రిలాటి వాళ్లు మొహమాటపడి రాసేస్తారు. కానీ డబ్బున్నవాళ్ల కష్టాల గురించి ఎవరూ రాయరేం?"

"ఇన్‌కంటాక్స్ విధానాల గురించి ఉపన్యసించ బోతున్నారా సర్?"

"కాదు, టాక్స్ ప్రాబ్లమ్ కాదు. జనాల అవగాహన గురించి చెప్పబోతున్నాను. వారి దృష్టిలో గొప్పవారంటే అవగుణాల కుప్పలు. ఉదాహరణకి నేను, 'ఈ రోజుల్లో పనివాళ్లు మహాపొగరుగా, తల బిరుసుగా ఉంటున్నారోయ్' అన్నాననుకో. 'తాడిత పీడిత దళిత జనులు తరతరాల బానిసత్వపు శృంఖలాలు త్రెంచుకొని హక్కులకై గొంతు విప్పితే ఓర్వలేక ఈ ధనిక జాతి అన్యాయపు ఆరోపణలు చేస్తోంది ' అని నా పేరు చెప్పి నా జాతినీ, నా జాతిపేరు చెప్పి నన్నూ తిట్టిపోస్తారు. అదే మధ్యతరగతి వాళ్లు అన్నారనుకో– 'సమకాలీనసమాజంలో జరిగే మార్పులను చక్కగా పరిశీలించారు' అంటూ మెచ్చుకుంటారు. క్యాచ్ మై పాయింట్ ? నే చెప్పిన అంశం వంటబట్టిందా?"

"యస్ సర్. వంటవాడు ఇంకా వచ్చినట్టు లేదు. ఏర్పాట్లు చూసి వస్తాను సార్".

"ఆగవయ్యా, భర్త ఏదో ఉత్సాహంతో దేశరాజకీయాల గురించి మాట్లాడబోతే 'వంటింట్లో పనుంది' అని జారుకునే భార్యామణిలా పారిపోతావేం? నేను చెప్పిన దాంట్లో పస ఉందా? లేదా? నేనే జాతికి చెందినవాడి నయితేనేం? ఈ రోజుల్లో శ్రామికజనం పొగరు బలిసేరా? లేదా? ఒకప్పుడు చక్కగా మాట్లాడ్డం కష్టపడి

నేర్చుకునేవారు. ఇప్పుడు తిట్లు లంకించుకోవడమే విద్యగా పరిగణిస్తున్నారు. చెప్పినమాట వినకపోవటమే ఆత్మగౌరవం! అవినయం ప్రదర్శించటమే ఆత్మ విశ్వాస ప్రకటన! డబ్బు తీసుకొని పని ఎగ్గొట్టమే విప్లవపంథా! పనిచేయకుండా సోమరిగా తిరగడమే, వ్యక్తిత్వ నిరూపణ! అదీ వీళ్ళ ధోరణి, హు, బాగుపడే విధానమా ఇది? ఇదివరకు పైకి ఎగబాకుదామని చూసేవారు. ఇప్పుడు దిగజారడమే ఫేషన్ అయిపోయింది. రిజర్వేషన్లు వచ్చాక మేం వెనకబడినవాళ్లం అంటే మేం వెనకాతివెనకబడినవాళ్లం అనడంలో పోటీ పడుతున్నారు".

"నిరంతర చలనశీల సమాజంలో నిత్యమూ మారుతున్న విలువలు, మారుతున్న ఆర్థిక సంబంధాలు – మనుష్యుల ఆలోచనా విధానంలో, మాట్లాడే ధోరణిలో మార్పు కలిగించటం సహజం అంటారు సర్".

"బాగు బాగు, 'ఆ మార్పుకు చలనచిత్రములు దోహదము చేయచున్నవా!' అన్న విషయము మీ పరిశీలనకు వచ్చినదా? అని మేము అరయగోరెదము. ఈ డొంక తిరుగుడెందుకు? సూటిగా చెప్పు– సినిమాల్లో ముఖ్యపాత్రల చిత్రీకరణ మన జీవిత లక్ష్యాలనే మార్చేసింది కదూ? ఒకప్పటి హీరో పగటిపూట రిక్షా తొక్కితే రాత్రి స్కూల్లో చదివేవాడు. లేదా రాత్రి రిక్షా, పగలు చదువు. మరిప్పుడు? చదువురాని నిశానీ పద్దు వాడే హీరో! చదువుకున్నవాడికి సంస్కారం ఉండదని ఉపన్యాసం ఒకటిపైగా! పైఅంతస్తుకు చెందిన కథానాయికపై అనురాగాన్ని సంకోచంతో మనస్సులో దాచుకునేవాడు పాతహీరో. కథానాయికను పబ్లిగ్గా ముద్దెట్టుకుంటానని ఛాలెంజి చేసి, అంత పనీ చేయడం, ప్రేమించడానికి దగ్గర కొస్తే దాని పృష్ఠభాగంపై దరువులు వేయడం ఇప్పటి హీరో పని. పాత సినిమాల్లో హీరో పరిస్థితులకు లొంగి దొంగయైనా, చివరి రీల్లో జైలుకెళ్లొచ్చి బాగుపడ్డట్టు చూపించేవారు. ఇప్పుడు జబర్దస్తీగా దొంగతనం చేసి, శిక్షా గిక్షా పడనివాడు హీరో! ఇదివరకు హీరో స్వయంకృషితో పైకొచ్చి ఇంగ్లీషు మాట్లాడితే హాల్లో చప్పట్లు వినబడేవి. ఇప్పటి హీరో సూటు బూటూ వేసుకొన్నవాడిని 'ఇంగ్లీషులో మాట్లాడతావేంట్రా నాకొడకా! ఎవడికి పుట్టావురా?' అంటూ హేళనచేసి చావగొడుతున్నాడు. అవునా, కాదా?"

"మీరు చెప్పిందంతా నిజమే సర్. కావ్యాలలో, నాటకాలలో, సినిమాలలో ముఖ్యపాత్రధారులే ప్రజలకు ఆరాధ్యులు, అనుకరణీయులూ కావడం సహజం సార్. వారు నిత్యజీవితంలో దీనికి భిన్నంగా వున్నా, తెర మీద కనబడే రూపమే ప్రేక్షకుల

మనస్సులలో హత్తుకుంటుంది. ఇక వెళ్లి రానా సర్?"

"ఆగాగు, ఒప్పుకొన్నావు కదా! ఇప్పుడొక కేసు చెబుతాను విను. మా అత్తయ్యగారింట్లో నేను ఉన్నప్పుడు, ఆవిడ ఫ్రెండు, మన మద్రాసావిడే! ఆవిడ వచ్చి తన కూతురి గురించి మొర పెట్టుకొంది. అ అమ్మాయి గ్రాడ్యుయేటు. పేరు కలావతి. కళావతి అనే పేరు నోరు తిరక్క కలావతి అనేదిట చిన్నప్పుడు. ఆమె పగటి కలలు కనే లక్షణం చూసి అందరూ ఆ పేరే స్థిరం చేసేసారట. ఉన్నవాళ్లే. ఢిల్లీనుంచి ఓ ఇంజనీరు సంబంధం తెస్తే పెళ్లి చేసుకోను పొమ్మందట. ఏం అని తల్లి అడిగితే 'మగసిరి లేదందట. తల్లి నెత్తి మొత్తుకుని 'అదెప్పుడు పరీక్షించావే?' అంది. 'చూస్తే తెలీదా?' అందిట కూతురు. తల్లి ఈ సారి నోరు నొక్కుకొని 'ఏం చూసావే?' అని లబలబ లాడిందట. 'పెళ్లిచూపుల్లో ఆ కూర్చునే తీరూ,బట్టలు వేసుకునే పద్ధతీ, మాటలధోరణీ చూస్తే తెలియడం లేదూ ఒట్టి ముద్దపప్పుగాడని. మొగాడంటే రఫ్ అండ్ టఫ్‌గా ఉండాలి' అందిట కూతురు.

పెళ్లిచూపుల ముచ్చట గురించి చెప్పమంటే ఆవిడ చెప్పింది – పెళ్లికొడుకు పేరు సుబ్రహ్మణ్యంట. విక్కీ కాదు. సోఫాలో ఒదిగి కూర్చున్నాట్ట – టీపాయ్ మీద కాళ్లు పడేసి కాదు. సూటు వేసుకొన్నాట్ట.. మెడలో స్కార్ఫ్, తలకు బందనా, చొక్కా చివర్లు కలిపి వేసిన ముడీ – ఏవీ లేవట. అండీ గిండీ అని మాట్లాడేడట. బీడీ నవులుతూ 'పంబ రేగిపోద్ది పలకమారిన పిల్లా' అని అనలేదట.

కుర్రాడు మాత్రం అమ్మాయంటే మోజుపడుతున్నాట్ట. ఢిల్లీ ఉద్యోగానికి సెలవు పెట్టి, ఈ ఊళ్లోనే బంధువులింట్లో మకాం వేసాట్ట –సంబంధం కుదుర్చుకొని పోదామని..

అచలపతి సన్నగా దగ్గి " అమ్మాయి ఎలా ఉంటుందో చెప్పలేదా సర్?" అన్నాడు.

"అమ్మాయి పైకి మామూలుగానే ఉంటుందట. అంటే అందంగా, గొప్పింటి బిడ్డలా మర్యాదా మన్ననా తెలిసినా మనిషిలా, అందుకనే తన కంటె భిన్నంగా ఉండే వాళ్లపై మోజు. చెప్పానుగా సినిమాల ప్రభావం! కాలేజిలో చదివేరోజుల్లో కాలేజికి దగ్గర్లో ఉన్న కారు మెకానిక్‌ని చూసి ఇష్టపడిందట. తను కోరుకున్న 'రఫ్ అండ్ టఫ్ రస్టిక్ వీడేరా' అనుకుంది. ఈమధ్య సినిమాల్లో హీరో ఇద్దరేసి అమ్మాయిల్ని ఏం సంకోచమూ లేకుండా అతిసహజంగానే పెళ్లాడడం చూపించడంతో ఈమె ప్రభావితురాలై, అతని భార్య దగ్గరకెళ్లి 'అక్కా' అంది. కానీ ఆ ప్రోలిటేరియట్ పతివ్రత ఆట్టే సినిమాలు చూడదు కామోసు చీపురు తిరగేయబోయింది. భయపడి వచ్చేసి ఆపాటి మగటిమి ఉన్న



మొగుడి కోసం గాలిస్తోందట. ఈ సంబంధం చేజారిపోతుందేమోనని తల్లితండ్రుల భయం. నేను హామీ ఇచ్చేను – ఆ అబ్బాయిని పిలిపించి అతన్ని మారుస్తానని. ఇంకాస్సేపట్లో వస్తూండాలి.”

“సర్, ఒక విషయం మీరు గ్రహించే ఉంటారనుకొంటాను. ఊహల్లో తేలేది ఆ అమ్మాయి కాబట్టి మార్చవలసినది ఆ అమ్మాయినని. ఆ అబ్బాయి మామూలు అబ్బాయే కదా!”

"అచలపతీ, నువ్విక్కడే తప్పులెక్క వేస్తున్నావు. రెన్ అండ్ మార్టిన్ చదువు. ఆల్జీబ్రా బాగా వస్తుంది. మైనస్ ఎక్స్‌ని ప్లస్ వై చేయాలంటే ఓ నిలువుగీత పెట్టేసి, ఎక్స్ కింద చిన్నగీత చెరిపేస్తే సరిపోదు. ఆ అమ్మాయిని మార్చాలంటే సినిమా హీరో ఇమేజిలనీ, సినిమాలనీ, సినిమాలను ప్రభావితం చేస్తున్న సమాజాన్నీ, అందర్నీ హోల్‌సేల్‌న మార్చాల్సి వస్తుంది. అది మన వల్లకాదు కాబట్టి సింపుల్‌గా అబ్బాయినే మారుస్తాం".

"మీరన్నీ ఆలోచించే చేస్తారని నాకు తెలుసు సర్".

"అలారా దారికి. ఇప్పటికైనా వెళ్లి వంట సంగతి చూడు. మెదడుకి మేత వేయడం తర్వాత. ముందు శరీరానికి మేత వేసి బతికించుకోవాలి కదోయ్!"

"మన్నించాలి సర్. మీ అంత వేగంగా మారలేకపోతున్నందుకు".

❖ ❖ ❖

కొంతమంది చిన్నప్పణ్ణుంచీ ఊహూ మంచివాళ్లుగా ఉందామని చూస్తారు. 'మంచి వాడివి మజ్జిగన్నం తినమ్మా' , 'మా బాబు మంచివాడు బట్టలు మాపుకోకుండా బళ్లోకి వెళ్ళి బుద్ధిగా తిరిగొస్తాడు' అంటే తింటారు, తిరిగొస్తారు. కానీ మంచీ, చెడూ రెలెటివ్ అన్న సంగతి వీళ్లు గ్రహించరు. వానలో నానుతూ కాగితంపడవలు వేయకపోతే పెద్ద వాళ్ల మెప్పు పొందవచ్చు కానీ, తన ఈడువాళ్లతో స్నేహం పాడవుతుందని తెలుసు కోరు. లవ్‌లెటర్ రాయకుండా ఉండి ఇంట్లోవాళ్ల అభిమానాన్ని చూరగొంటారు కానీ, ఆశాభంగం పొందిన పక్కింటి అమ్మాయి పగబట్టి దుష్ప్రచారం చేస్తుందని ఊహించలేరు. ఈ అజ్ఞానానికి తోడు అహంభావం ఒకటి. చిన్నప్పుడు తాము గోటీబిళ్ల ఆడకపోవడం చేతనే ఈనాడు గుడిసెలలో లేమనీ, సిగరెట్టు కాల్చకపోవటం వల్లనే ముష్టెత్తుకోవటం లేదనీ నమ్ముతారు. అలా అడిన, కాల్చినవాళ్లలో కొందరైనా తమతో సమాన స్థాయిలో ఉన్నారన్న విషయాన్ని కనరు, వినరు, మూర్కొనరు.

చిన్నప్పట్నుండీ తల్లి తండ్రులచే మంచిగొట్టబడిన వాళ్లను మామూలు మనిషిని చేయడం ఎలా? అన్న పుస్తకం డేల్ కార్నిజీ (లేక గీ) రాయలేదని వర్రీ అయి, ఆయన మరో పుస్తకం చదివి దాన్ని స్టాప్ చేసుకొని ఎదురుగా ఉన్న సుబ్రహ్మణ్యాన్ని ఎగాదిగా చూసాను. ఆ పేరున్న వాళ్లు క్షమిస్తే ఓ మాట చెబుతా – సుబ్బారావు, సుబ్రహ్మణ్యం పేర్లలోనే ఓ మెతకతనం ఉంది. సుబ్బారావుకి కోపం వస్తే అదో సినిమా కథయి తెరకెక్కవలసినంత విశేషం! ఈ సుబ్రహ్మణ్యం మెతకతనం, మంచితనం కలబోసి,

పోత పోసినట్టున్నాడు. పాపం అరగంట నుండి ఓ సిగరెట్టు కాల్చడానికి అవస్థ పడుతున్నాడు, పెడుతున్నాడు. వేళ్ల మధ్య అగరొత్తులా పట్టుకొంటాడు, 'కాల్చవయ్యా' అని కసిరితే పొగ మింగేస్తాడు. ఇటువంటివాడిచేత బీడీలు కాల్పించేసరికి కలావతి వేరేవాణ్ని పెళ్లి చేసుకొని తల్లి కావడం ఖాయం. కాబట్టి రేపిడ్ కోర్సు రూట్ వెతక్క తప్పదు. చూస్తే మగతనానికి లోటు ఉన్నట్టు కనబడలేదు. అమృతా సింగ్‌లా ఉండనంత మాత్రాన మగాడు కాదని అనేయడం కలావతి తప్పు) కనబడే ఆకారం మార్చాలి కాబట్టి "చూడు బాబూ ఆ పాపిడేమిటి, తలకు కొబ్బరినూనె రాసుకోవటమేవిటి, వారంవారం తలంట్లేమిటి? నీ జుట్టు తైలసంస్కారం, నోరు భాషాసంస్కారం మర్చిపోవాలి. అసహ్యంగా రోజూ గడ్డం గీసుకో వడం ఎందుకు? అది యెప్పుడూ మాసి ఉండాలిగానీ".

"పెంచమంటారా సార్? పరీక్షలొచ్చినప్పుడల్లా తిరుపతి మొక్కు కోసం పెంచటం నాకలవాటే సార్ " ఉత్సాహంగా అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నువ్వెక్కడ దొరికావయ్యా బాబూ! మాయడం అంటే పెంచడమా? ఎప్పుడూ చూసినా రెండు, మూడు రోజులుగా గడ్డం గీయని వాడిలా ఉండాలి".

'ఆ మాపు ఎప్పుడూ ఒకేలా ఎలా ఉంటుంది సార్? నాలుగో రోజుకి...".

"అందుకేనయ్యా రోజూ గీయాలి. పై పైన... అలా, అలా.. బులబులాగ్గా గీయాలి. తర్వాత.. శుబ్బరంగా మాసిన బట్టలేసుకోకుండా ఈ సూటు, బూటూ ఏమిటి? ఆ టై తీసి రుమాల్లా మెడకు కట్టుకో. వెలిసిపోయిన పాంటు, ఓ లూజు కాటన్ చొక్కా తగిలించు- కండలు కనిపించేట్లు".

'నాకు కండలులేవు కదండీ" వెర్రి మొహంతో ప్రశ్న!

"అవును బొత్తిగా లేవు. చిన్నప్పట్నుంచీ ఆటలవీ ఆడలేదా?"

"లేదండీ. ప్లే గ్రౌండ్‌కెళ్లే టైములో మా నాన్నగారు లైబ్రరీ కెళ్లి జనరల్‌నాలెడ్జి పుస్తకాలు చదమనేవారండి. కాస్త పెద్దయ్యాక సాయంకాలాలు టైపు, షార్టు హాండు నేర్చుకోమనేవారండి. దాంతో నాకూ, ఆటలకీ ఆమడ దూరం అయిపోయిందండి".

"స్కూల్లో గేమ్స్ క్లాసులుంటాయిగా..".

"వాటిలో డ్రిల్లు మాష్టారి అధికారమే కదండి. మాలాంటి ఫస్టుర్యాంకు లొచ్చిన వాళ్లను అసహ్యంగా చూసి ట్వెల్త్ ప్లేయర్‌గా పెట్టేవాడు. క్లాసు లెగ్గొట్టి, ఆయన్తో బాటు సిగరెట్లు తాగుతూ, లేడీటీచర్ల వివరాలు చెప్పే కుర్రాళ్లకే ఛాన్సిచ్చేవాడండి."

"సరే అయిందేదో అయింది. ఇప్పటికైనా రోజూ వ్యాయామం చెయ్యి. అడ్డపడి తిను. తినే తీరు కూడా అడవి మనిషి పచ్చి మాంసం పీక్కు తినేట్లు ఉండాలన్నమాట. బైదిబై నీకు తెలిసిన పెద్ద బూతు మాట చెప్పు చూతాం".

చెప్పాడు . "ఏడిసినట్టుంది. సకుటుంబంగా చూడదగ్గదని ప్రచారం చేసుకొనే 'యు' చిత్రంలో హీరో అమ్మమ్మ నిర్మలమ్మ కూడా ఇంతకంటె రసవత్తరమైన మాటలు అనగలదు".

"పోనీ బూతులు నేర్చుకోవటానికి పుస్తకం ఏమయినా ఉందాండి?"

"తెలుగులో ఇంకా అటువంటి డిక్షనరీ రాలేదు కాబట్టి సినిమాలవాళ్లే ఆ భారం నెత్తిన వేసుకొని నిర్వహిస్తున్నారు. ఎందుకైనా మంచిది, నువ్వు ఇల్లు మారిపో. ఓ బస్తీలో కాపురం పెట్టి వాళ్లతో మెలగు. బూతులూ అవీ వాటంతటవే పట్టుబడతాయి".

"రైతో, వారంరోజుల తర్వాత బూతులు అప్పచెప్తాను. అప్పచెప్పించుకుంటారా?"

"ఆగాగు, అంతటితో కాలేదు. ఆ బస్తీలో పొట్టిలంగా, చిట్టి జాకెట్టు వేసుకొని మాటమాటకూ, మాటిమాటికీ ఒంగి మాట్లాడే అమ్మాయి నొకదాన్ని చెల్లెలిగా స్వీకరించు. దాని వంపులు చూసి ఎవడైనా పెదాలు తడుపుకున్నాసరే 'ఆడదాన్ని గౌరవించలేని ఈ కొడకా ఆ కొడకా" అంటూ ఏ ఆడదీ అనరాని, వినజాలని భాషాజాలంతో వాణ్ని చితక్కొట్టు. దెబ్బకి రఫ్‌నెస్ దానంతట అదే వస్తుంది".

ఈ కేసబియాంకాలతో ఓ సౌలభ్యం ఉంది. చిన్నప్పుడు తల్లితండ్రులు చెప్పిన మాట ప్రకారం నడుచుకొని బుద్ధిమంతు డనిపించుకొంటారు. పెళ్లయ్యాక భార్య మాట విని, అత్తవారికి మంచివాడు, తల్లితండ్రులకు చెడ్డవాడు అవుతాడు. (అప్పుడూ కూడా తల్లిదండ్రులు చిన్నప్పుడు పిల్లవాడి వ్యక్తిత్వాన్ని చంపివేయడం తమ పొరపాటని గుర్తించరు; కోడలు మందు పెట్టేసిందనే అంటారు).

మన సుబ్రహ్మణ్యం కూడా అలవాటు కొద్దీ, ఎదురు ప్రశ్నలు వేయకుండా, నేను చెప్పిన మాటలు పూర్తిగా తలకెక్కించుకొని, తుచ తప్పకుండా అమలుపరచి, వారం రోజుల తర్వాత మా ఇంటికి వచ్చినప్పుడు సోఫాలో కుదురుగా కూర్చోకుండా కాలు సీటు మీద పెట్టే మాట్లాడేడు. కాస్సేపటికి కాళ్లు పీకినా సోఫా చేతిమీద కూర్చున్నాడు కానీ సీటు మీద కూర్చోలేదు.

"పాఠం బాగానే వంటబట్టింది కానీ కుర్చీచేతి మీద కూచున్నప్పుడు పొగరుగా కాళ్లు ఆడిస్తూండమన్నాను కదా, మర్చిపోయావా?" అన్నాను.

“మర్చిపోలేదు సార్. ప్రయత్నం చేస్తున్నాను. కానీ కాలే ఆడడం లేదు. బెణికిందిగా”.

ఇతని ‘చెల్లెలు’ తనను ఏడిపించబోయినవాడి పోరాట శైలి చూసి, వరించి ఇతను పళ్లబండి మీద పడుక్కొని యుద్ధం చేసేటప్పుడు, బండి ఎత్తేసిందట. అరటిపళ్ల గెల మీద కాలుజారి బెణికిందట.

ఇటువంటి హిడింబి, రుక్మిణిలాటి చెల్లెళ్లను వదిలిపెట్టి, గుడిసెలో ఉంటూ కత్తులు నూరుకునే అబల నెవర్నైనా స్నేహితురాలిగా ఉంచుకోమన్నాను.

అటువంటివాళ్లు తమ ప్రేమను గుండెల్లోనే దాచుకొని, పోరాటాల్లో గూండాల కత్తికి ఎదుర్రొమ్ము బలి ఇచ్చి తనను కాపాడతారని కూడా చెప్పాను.

అంతే కాకుండా ఇంకొకళ్ల కష్టార్జితమో, పిత్రార్జితమో అయిన స్థలంలో గుడిసెలు వేసుకొని బతికేవాళ్లలో ఓ అమ్మను వెతుక్కుంటే, ఆమె గుడిసె పీకడానికి ప్రభుత్వాధికారులు వస్తే వాళ్లని చావగొట్టి, చెవులుమూసే ఛాన్స్ వస్తుందని కూడా చెప్పాను.

తర్వాత ఏ పని చేయకుండా రికామీగా తిరిగే పదిమంది కుర్రాళ్లను పోగుచేస్తే, వాళ్లతో బాటే పోరంబోకులా తిరుగుతూ కూడా, కష్టపడి పని చేసి బతకడంలో గల ఆనందాన్ని గురించి ఉపన్యాసాలు దంచవచ్చని చెప్పాను.

చివరగా “తాగే అలవాటుందా?” అని అడిగేను.

“కాన్ఫరెన్స్‌ల్లో కాస్త తీసుకొంటానండి. కానీ ఎప్పుడూ ‘అవుట్’ అవను”.

“ఛ ఛ! ‘అవుట్ ’అయ్యేట్టు తాగి, లుంగీ ఎగ్గట్టి, తుపాకీ చేతబట్టి అల్లరి చేస్తేనే కదా మీ ఆవిడతో సరసమాడినట్లు లెక్కకొస్తుంది. ఇప్పణ్నుంచీ ‘లోకల్ స్టఫ్’ మాత్రమే తీసుకొని ‘అవుట్’ అవడం నేర్చుకో”.

తంజావూరు కళాకారులు తమ బొమ్మలకు మోడల్ కావలసివస్తే ఇతన్ని బుక్ చేసుకోవచ్చు. అన్నిటికీ తలాడించి వెళ్లాడు.

“చూశావా, అచలపతీ, మా శాంకోపాంజాను..” అన్నాను విలాసంగా.

అచలపతి పెదాల మీద నవ్వు మొలిచిందేమో నన్న అనుమానం వచ్చేలోపలే వెలిసిపోయింది.

“అతన్ని శాంకోపాజాగా వర్ణించడం వలన మీ గురించి గొప్పగా చెప్పుకున్నట్టవదు సర్” అని సూచించాడు.

“ఓహ్ నీ భయం నాకర్థమయింది. కానీ శాంకోపాంజా గురువుగారు చేసిన

తెలివితక్కువ పనేమిటి? పాపం ఓ దీవిలో ఇరవై, పాతికేళ్ల పాటు ఒంటరిగా గడిపేడు. అంతేగా?"

చిన్న దగ్గు, గొంతు సవరింపు. "నేను పొరబడకపోతే మీరు క్విక్సోట్, క్రూసో ల మధ్య కన్ఫ్యూజ్ అవుతున్నారని అనిపిస్తోంది సర్. క్విక్సోట్ - శాంకోపాంజా ఒక జంట, క్రూసో- మాన్ ఫ్రైడే మరొక జం..."

"ఆఁ ఆఁ గుర్తొచ్చింది. అది సరే నువ్వు నూరు ఏళ్ల తర్వాత మరో జన్మ ఎత్తినప్పుడు చూడు - మన అనంత్ - అచలపతి జంట కూడా చరిత్ర పుటల్లోకి ఎక్కుతుంది".

అనంతం అనే నా పూర్తి పేరు ఎందుకు వాడటం లేదాన్న సందేహం మీకు రావచ్చు. నా అసలు పేరు అనంతశయనం. తిని కూచుంటే కొండంత ఆస్తి కూడా కరిగిపోతుందనే సామెత ఉంది కదా. తిని పడుక్కొన్నా ఆ సామెత అన్వయిస్తుందాని పరిశోధన చేస్తూ ప్రయోగం అవసరాల కొద్దీ నేను తరచుగా నిద్రపోవలసి రావడం వల్ల నన్ను సార్థక నామధేయుడని కొంత మంది ప్రజలు వేళాకోళం చేయడంతో పేరులో పూర్వార్థాన్ని మాత్రమే ఎక్కువ వాడకంలో తెచ్చాను. ఇక అచలపతి కూడా నాలాగే బ్రహ్మచారి కాబట్టి అతనిపేరు ఏ స్త్రీతోనూ కలిపి చెప్పే అవకాశం రాదు. అందువల్ల మా జంటపేర్లు చరిత్ర కెక్కుతాయని నా నమ్మకం.

నెల్లాళ్ల తర్వాత సుబ్రహ్మణ్యంలో వచ్చిన మార్పు పైన పటారమో లేక సమూలంగా జరిగిందో తెలుసుకొందామని కలావతి తండ్రీ, నేనూ అతని బస్తీకి పోయి చాటుగా గమనించినప్పుడు అచ్చోసిన ఆంబోతులా ఉన్న అతని ప్రవర్తన చూసి ఆ కన్యాదాత గంతులేసాడు- 'మా అమ్మాయి కోరిన మగాడు, మొనగాడు, మొగుడు వీడే' నంటూ.

మరుసటిరోజు మరోలాటి ఆనందంతో వచ్చాడు - వాళ్ల అమ్మాయికి ఈ మగసిరి సుబ్రహ్మణ్యం అక్కర్లేదట. మామూలు సుబ్రహ్మణ్యమే చాలట. 'మై ఫెయిర్ లేడీ'లో మిస్ డూలిటిల్‌కు తను కష్టపడి నాగరీకం నేర్పాక మళ్లీ పాత భాషే మాట్లాడతానంటే బెర్నార్డ్ షా ఎంత బాధపడ్డాడో అలా ఫీలయ్యాను - రౌడీ సుబ్రహ్మణ్యాన్ని మళ్లీ పాత సుబ్రహ్మణ్యంగా మార్చాలంటే! కలావతిలో జరిగిన పెరిస్త్రోయికాకు కారణం ఇదట..

ఆచలపతి మూడు వారాల క్రితం సత్తిగాడనే కుర్రాణ్ని వాళ్ళింట్లో పనికి కుదిర్చేడట. సత్తిగాడు కలావతి కాలేజీ దగ్గరున్న మెకానిక్కు కొడుకేట. ఈ మూడు వారాల్లో సత్తిగాడి ఏబ్రాసితనం, అశుభ్రత, బండ మాటలు, రౌడీతనం చూసి కలావతి

బేజారెత్తిపోయిందట. ఆ మెకానిక్కు లాటి మొరటు మొగుడు ఉంటే సత్తిబాబు లాటి మొరటున్నర పిల్లలు పుట్టుకొస్తారన్న విషయం ఆమెకు అప్పుడర్థ మయిందట. ఆమె ఊహల్లో మొగుడు మగటిమితో ఉట్టిపడుతున్నా, పిల్లలు మాత్రం మల్లెపువ్వులాంటి బట్టల్లో మిలమిలలాడుతూ టక టకా ఇంగ్లీషు మాట్లాడుతూ, ఫస్టు రేంక్‌లు తెచ్చేసుకొంటూ చెప్పినమాట వినేస్తూ ఉండాలిట. సత్తిగాడులాటి పిల్లల్ని తప్పించుకుకోవాలంటే ముద్దపప్పు మొగుడే గతి అని గ్రహించుకొందిట.

"నిజానికి సుబ్రహ్మణ్యం రౌడీగా మారటం నాకూ ఇష్టం లేదు. అల్లుడని చెప్పుకోవడానికి నలుగురిలో ఎంత నగుబాటుగా ఉంటుందో చెప్పండి. అమ్మాయి మాట కాదనలేకపోయానప్పుడు! ఎలాగైతేనేం, కథ సుఖాంతమయింది. మేమెన్ని చెప్పినా వినిపించుకోని అమ్మాయి ఇలా మారిందంటే సత్తిగాడిని పనికి కుదర్చాలన్న అచలపతి అమోఘమైన అయిడియాయే కారణం. అతనికి ధన్యవాదాలు అందజేస్తారు కదూ!"

ధర్మరాజు చేసిన రాజసూయయాగంలో అతని పేర బహుమతులందుకొంటున్న దుర్యోధనుడికి ఎసిడిటీ ఎందుకొచ్చిందో నాకర్థమయిందప్పుడు.

మళ్లీ పెళ్లిచూపులయిన మర్నాడు సుబ్రహ్మణ్యం వచ్చి కలావతి నచ్చలేదన్నాడు. తెల్లబోయాను. ఎదుటివాడు హుషారుగా ఉండాలని కోరుకోవడమే తప్ప కలావతి తను ముద్దపప్పుగానే మిగిలిపోయిందట. బస్తీలో సెకండ్ హీరోయిన్‌గా ఉంచుకొన్న రంగిలో ఉన్న చొరవ, దూకుడుతనం, రెచ్చగొట్టే ఆకర్షణ, కవ్వించే లక్షణం కలావతిలో కలికంలో కూడా లేదట. రంగి ఎప్పుడూ మోకాళ్ల వరకే లంగా ధరిస్తుందట. పైట జందెం మందాన మాత్రమే ధరిస్తుందట. ఊపిరి బిగబట్టి, ఎప్పుడూ ఛాతీ పొంగించి ఉంచుతుందట. ఎప్పుడూ పోట్లాటకి దిగుతూ పైన పైన బడి 'రఫ్ ఆడిస్తావా? పఫ్ ఆడించమంటావా? 'లాటి ఊతపదాలు గుప్పిస్తుందట. ఏ చిన్న పండగ వచ్చినా కాళ్లు ఎడంగా పెట్టి నడుము భలేగా ఊపుతూ డాన్స్ చేస్తుందట. నీళ్లల్లో తపతప కొట్టుకొంటూ పొర్లగలదుట.

"ఆడదంటే అలా ఉండాలికానీ, కలావతిలాటి మనిషి చేసుకుంటే పసేముంటుంది బాస్! నువ్వింకా దాని కేసు రికమెండ్ చేస్తే టోపేరం లేచిపోద్ది జాగర్త!" అని నా వీపు మీద ఓ చరుపు చరిచి వెళ్లిపోయాడు సుబ్రహ్మణ్యం.

